క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా హాజారిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అనుముల మండల విద్యుత్ ఏఈ ధనరాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు ఉదయం 10గంటలనుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయం, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తడకమళ్ల సబ్ స్టేషన్ పరిధిలో..

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండల పరిధిలోని తడకమళ్ల సబ్‌స్టేషన్‌లో మెయిటెనెన్స్ పనులు జరుగుతుండటంతో ఆ సబ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న తడకమళ్ల, తక్కెళ్లపహాడ్, నర్సింహులగూడం, మైనంవారిగూడెం, దుబ్బతండా, జత్యతండా, దొండవారిగూడం, బండమీదగూడం, జేత్యతండా, తక్కెళ్లపాడు తండా, సామ్యతండా, కోడెబండతండా, కామేపల్లిగూడం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయా గ్రామాల గృహ, వాణిజ్య, వ్యవసాయ పరిశ్రమల వినియోదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ బి. అమర్‌సింగ్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

గుర్రంపోడు : మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం భూ భారతి చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్డీఓ రమణారెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, రైతు ప్రతినిధులు సదస్సుకు హాజరై భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

మాడుగులపల్లిలో రేపు అవగాహన సదస్సు

మాడుగులపల్లి : భూభారతి చట్టం-2025పై అవగాహన సదస్సు ఆదివారం మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్ శుక్రవారం తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. సదస్సుకు రైతులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

పెద్దఅడిశర్లపల్లి : ఉపాధిహామీ 14వ ప్రజావేదిక శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ చంద్రమౌళి ఒక ప్రకసలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024 ఏప్రిల్ నుండి మార్చి 31 2025 వరకు నిర్వహించిన పనులపై ఈ నెల 12వ తేది నుండి 25వ తేదీ వరకు 14 వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్న ఘటన శుక్రవారం మిర్యాలగూడ మండలం తక్కెళ్ల పాడులో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారంతో మూసీ నది వద్దకు చేరగా అక్కడ నాలుగు ట్రాక్టరర్లు ఉండగా పోలీస్‌లను చూసి మూడు ట్రాక్టర్ల ట్రాలీని వదిలేసి ఇంజన్లతో పరారైనట్లు తెలిపారు. ఆ ట్రాలీలపై ఒకదానికి నంబరు ఉండగా మరో రెండు ట్రాలీలకు నంబర్లు లేవు. ఈ ట్రాలీల యాజమానులు ఎవరు అని విచారించగా నేరేడుచర్ల మండలం దాసారం గ్రామానికి చెందిన జనార్దన్, ఎస్‌కె సైదులు, నరేందర్ అని తెలిపడంతో ట్రాలీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్లకు సంబంధించిన వారిపై కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

గుర్రంపోడు : వేసవి సెలవుల్లో సొంత గ్రామాలకు, టూర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్ఐ పసుపులేటి మధు కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో కూడలిలో ప్రజలకు ఈ మేరకు అవగాహన కల్పించారు. ఇళ్లు విడిచి వెళ్లే వారు తమ ఇంట్లోని విలువైన బంగారు వెండి ఆభరణాలు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని, లేదా వెంట తీసుకెళ్లాని సూచించారు. ఇంటికి తాళం వేసి డోర్ కర్టెన్‌తో కవర్ చేయాలని, ఇంటి లోపల ఒక లైట్ వేసి ఉంచాలన్నారు. చుట్టూ పక్కల ఇళ్ల వాళ్లకు ఇంటిని గమనించాలని చెప్పాలని తెలిపారు. ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకుని ఫోన్‌కు అనుసంధానం చేసుకుని అప్పుడప్పుడు చూస్తూ ఉండాలని ఫేస్ రికగ్నైజేషన్ అలెర్టు మెసేజ్‌లు వచ్చేలా చూసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు తాళం వేసి వెళ్లుతున్నట్లయితే సమాచారం పోలీసుస్టేషన్‌లో ఇవ్వాలని, గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

డిండి బస్టాండ్‌లో సమస్యల తిష్ట

- నక్రమంగా లేని మూత్రశాలలు
- కంకరతేలిన ఆవరణ
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంకర తేలిన డిండి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ



బస్టాండ్ ఆవరణలో స్వైరవిహారం చేస్తున్న పందులు

డిండి : హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే హైవేరోడ్డు మార్గ మధ్యలోని డిండి ఆర్టీసీ బస్టాండులో పలు సమస్యలు తిష్ట వేశాయి. దీంతో ఈ బస్టాండు గుండా ప్రతినిత్యం రాకపోకలు కొనసాగిస్తున్న వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నల్లగొండ జిల్లాకు చెందినప్పటికీ ఆర్టీసీ బస్టాండు నిర్వహణ మాత్రం మహబూబ్‌నగర్ రిజీయన్ పరిధిలో ఉండటంతోనే సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ బస్టాండ్ నోచుకోవడం లేదు. బస్టాండు ఆవరణలో కాంప్లెక్స్ షాపులు, రేకుల షాపుల నుంచి అద్దె రూపంలో పతి నెలా ఆదాయం వస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో మాత్రం సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు

సమస్యలతో సతమతం

హైద్రాబాద్, జనగాం, జహిరాబాద్, సంగారెడ్డి, కోదాడ, దేవరకొండ, కల్వకుర్తి, అచ్చంపేట, మిర్యాలగూడ, నల్గొండ,యా దగిరిగుట్ట తదితర డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు ఈ బస్టాండు గుండా రాకపోలు కొనసాగిస్తున్నాయి. బస్టాండు ఆవరణలోని మట్టిరోడ్డు కంకర తేలడంతో బస్సు ప్రయాణ ప్రాంగణంలోకి వచ్చిన సమయంలో బస్సు టైర్ కింద ఉన్న కొన్ని కంకర రాళ్లు ఎగిరి పడటంతో ప్రయాణికులకు గాయాలైన ఘటనలు ఉన్నాయి. అదేవిధంగా తాగునీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచక పోవడంతో కలుషితమైన నీటిని తాగడంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

చెత్తా చెదారంతో ఆవరణ

బస్టాండు టాయిలెట్స్, మరుగుదొడ్ల పైపులైన్ సరిగ్గా లేక పోవడంతో వాటి నుంచి మురుగు నీరు నిల్వ ఉంటుంది. దీనికితోడు బస్టాండు చుట్టూ పక్కల ఉన్న వ్యాపార దుకాణాలు చెత్త చెదారం పడేస్తుండటంతో బస్టాండు ఆవరణ చెత్తడంపింగ్ యార్డును తలపించేలా మారింది. దీంతో పందులు స్వైర విహారం చేస్తుండటంతో ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తుంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోని బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కారమయ్యేలా చూడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నం



డిండి బస్టాండు ఆవరణలో పారిశుద్ధ్యం పడకేయడంతో ఈ మార్గం గుండా ప్రయాణించినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. దీంతో రోగాల బారిన పడక తప్పండం లేదు.

– మూడావత్ జ్యోతి, కాల్యతండా

దేవరకొండ డిపోకు అప్పజెప్పాలి



బస్టాండులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అచ్చంపేట డిపో అధికారులకు వినతులు అందజేసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. బస్టాండు నిర్వహణ దేవరకొండ డిపోకు అప్పజెప్పాలి.

బల్మూల ప్రేమ్‌కుమార్, డిండి

ఆధార్ మాదిరిగా భూమికి భూధార్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి : మనిషికి ఆధార్ కార్డుల మాదిరిగానే భూమికి భూధార్ కార్డులు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం స్థానిక రైతు వేదికలో భూ భారతి చట్టం -2025పై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. త్వరలోనే ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారి, గ్రామ రెవెన్యూ అధికారులు రానున్నారన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రతి రైతుకు భూ భారతి ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు, సాదాబైనామాలు భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రైతు పట్టాదార్ పాసు బుక్‌లో భూమి విస్తీర్ణంతో పాటు భూ హద్దులు, మ్యాప్‌తో ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల విద్యాశాఖాధికారిని వరలక్ష్మి కలెక్టర్ మండలంలోని ఎన్ని పాఠశాలలున్నాయి, విద్యార్థుల సంఖ్య ఏ విధంగా ఉంది, సమస్యలు ఎమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుకున్నారు. దీంతో మండల వైద్యాధికారి రామాంజనేయులును ఓపీలు, రోగులకు అందుబాటులో ఏ మందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కాగా స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్, ఎస్ఐ శేఖర్, ఆర్ఐ శ్యాం పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

మిర్యాలగూడ : అవినీతికి పాల్పడిన గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు గురువారం వాడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఈ కార్యదర్శి చేసిన అక్రమాలపై 2023లో అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారని కాని తిరిగి ఇదే గ్రామపంచాయతీకి బాధ్యతలు అప్పగించడంతో అవినీతికి పాల్పడడంతోపాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదని, కలుషిత తాగునీరు వస్తున్నా చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల తోపాటు నాయకులు ఎండీ.యూసుఫ్, దేవండ్ల సుబ్బయ్య, సైదయ్య, చెన్నకేశవులు ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రజతోత్సవ సభను ప్రజలు కాంగ్రెస్ వ్యతిరేక సభగా భావిస్తున్నారని, కేసీఆర్ మాట్లాడేది వినేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలిరాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి, రేటినేని ముత్యంరావు,అర్వపల్లి నర్సిం, సుధాకర్‌గౌడ్, ఎర్ర యాదగిరి, గోలి గిరి, శ్రీను, నీల్,పేర్ల తదితరులున్నారు.

డిండి : వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు



హాలియా : ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న తహసీల్దార్ రఘు

పెద్దవూర : ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పులిచర్ల, పెద్దవూర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు ఇంటి వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని సరైన తేమ శాతం వచ్చాకనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2320లు, బి గ్రేడ్ రకానికి రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ధాన్యానికే మద్దతు ధర

హాలియా : రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ రఘు సూచించారు. శుక్రవారం మండలంలోని యాచారం గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులను పరిశీలించి తేమ శాతం చెక్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వరుస క్రమంలో ధాన్యం కాంటాలు వేసి వెంటనే మిల్లర్లకు తరలించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. రైస్ మిల్లర్లు ఏవైనా సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, ఎఫ్‌పీఓ డైరెక్టర్ జానయ్య, రైతులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం



సమ్మర్ క్యాంపు ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ టౌన్ : వేసవి కాలంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని ఎస్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణాకాలనీలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ముందుగా చదువుల తల్లి సరస్వతిదేవికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు పిల్లందరికీ విద్యా, వ్యక్తిత్వ అభివృద్ధికి ఎంతో కీలమన్నారు. వీటి ద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యం, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ క్యాంపు ద్వారా సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ ఫౌండేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ కాతోజు వినోదుకుమార్ చారి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ త్రిపురారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కామర్ల జానయ్య, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, బైరం కృష్ణ, మంజ్జిగపు వెంకట్‌రెడ్డి, నగిరి శ్రీనివాస్, బైరం శ్రీను, కొటిరెడ్డి, సయ్యద్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

దేవరకొండ : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20న 11 కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడికి వ్యతిరేకంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటయ్య,నాగటి నాగరాజు, లింగయ్య,జవహర్‌లాల్, లాలయ్య, బోద్యానాయక్ ఉన్నారు.

ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలి



హాలియా : నిరసన తెలుపుతున్న ముస్లింలు



దేవరకొండ : ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

దేవరకొండ : ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని జమియత్ ఉలేమా నేత మహ్మద్ ముఫ్తి జావిద్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీమొద్దీన్ అన్నారు. కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ శుక్రవారం పట్టణంలోని మక్కా మజీద్ నుంచి బస్టాండ్ వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫారుఖ్‌మౌలానా, మాజిద్ మౌలానా, రహత్‌అలీ, ఇలియాస్ పటేల్, ఖాజా మైనొద్దీన్, తౌఫిక్, ఇలియాస్, ఉమేర్, కలీం అన్సారి, షబ్బీర్, మొయిన్, రషీద్, ఫహీమ్, ఫయాజ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో..

కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా శుక్రవారం రాత్రి దేవరకొండ పట్టణంలో ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సం ఘాల నాయకలు పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, సుందరయ్య, మురళీకృష్ణ, ఏసయ్య, కృష్ణ,శ్రీరాములు,జగదీష్,పొట్ట ప్రభు, అంకూరి శివ,ఎర్ర విజయ్,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ

హాలియా : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ హాలియా పట్టణంలో ముస్లిం సోదరులు మసీద్ నుంచి బస్టాండ్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా, మజూర్ మోహినుద్దిన్, అంజత్ ఖాన్, షేక్ అన్వర్, షేక్ జావేద్, సేలేమాన్ ఖాన్, మహమ్మద్, మహమ్మద్ ఆసీఫ్, అబ్దుల్ రషీద్, మైనార్టీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడులను ఖండిస్తూ శుక్రవారం నందికొండలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో నిర్వమించిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నిడమనూరు : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా నిడమనూరు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధక్షుడు ఉన్నం చినవీరయ్య ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పాక్ దశ్చర్యలపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డి. కోటేశ్వర్ రెడ్డి, అబ్దుల్ హలీం, పెదబోయిన శ్రీనివాస్, మాయకోటి వినోద్, వలసాని నాగరాజు, సతీశ్,కామేశ్వర్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ముప్పారం గ్రామంలో యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతిచెందిన వారికి నివాళులర్పించారు.



నాగార్జునసాగర్‌లో..



దేవరకొండలో..



నిడమనూరు : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దోమలతోనే విష జ్వరాలు



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

త్రిపురారం : దోమల ద్వారనే విష జ్వరాలు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలని సీహెచ్ఓ మాతంగి వెంకయ్య అన్నారు. శుక్రవారం త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎండ వేడి అధికంగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు ఎండలకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుట్ట గోపాల్ రెడ్డి, ఏఎస్ఎమ్‌లు నూర్జాన్, లీలావతి, సరోజా, మీనా, జీవిత, యాదమ్మ, హైమావది, రాజశేఖర్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవి

దేవరకొండ : పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కళాశాల పూర్వ విద్యార్థులు తోడ్పాటునందించాలని కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి అన్నారు. కళాశాలకు ఇటీవల స్వయం ప్రతిపత్తి హోదా లభించిన నేపథ్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటయ్య, అధ్యాపకులు లింగమయ్య, లింగారెడ్డి, పూర్వ విద్యార్థులు గాజుల రాజేష్, మల్లికార్జున్, పల్లా దేవేందర్‌రెడ్డి, వనం శ్రీనివాసులు,నూనె యాదగిరి, ఆంజనేయులు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శేఖర్

అడవిదేవులపల్లి : సైబర్ నేరాలపపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్ కోరారు. శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాఢిజుజీ. ఎవరైనా ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హరి, పూర్ణ, నాగులు మీరా తదితరులున్నారు.

మేడేను జయప్రదం చేయాలి

పెద్దవూర : కార్మికుల హక్కుల కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న మేడే లో ప్రతి కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే 2న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని విజనయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతాల నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, ఊరె ప్రభాకర్, ఈగల సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


భూ భారతి చట్టంపై అవగాహన

కొండమల్లేపల్లి : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆర్టీఐ సమాచార హక్కు ప్రచార్ సమితి ఆధ్వర్యంలో భూ భారతి చట్టం-2025పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజునాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రాజు, వెంకటేస్, ఇస్లావత్ రమేష్, హరీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చందంపేట : మండలంలోని మూడుదండ్ల గ్రామానికి చెందిన మాడ్గుల నారయ్య, అన్నెపాక రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మేరకు బాధితుల కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయంగా ఇరు కుటుంబాలకు రూ.10వేల చొప్పున రూ.20వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్ప గోపాల్ రెడ్డి, దామెర శ్రీను, దేవుడు, యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టాలి



జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్యాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : అంధ విద్యార్థులకు సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టి చట్టం చేయించాలని డ్యాబ్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం నల్లగొండకు వచ్చిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అంధులకు ప్రత్యేక కళాశాలలు నిర్వహించకుండా సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అనంతరం అక్తర్‌ను మెమెంటో, శాలువాతో సత్కరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో డ్యాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, నాగులవంచ వెంకటేశ్వర్ రావు, తదితరులు ఉన్నారు.